
క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



గుడ్లవల్లేరు: కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడిగా గుడ్లవల్లేరు మండలం శేరీ కల్వపూడికి చెందిన మాజీ సర్పంచ్ కొత్తూరి లక్ష్మీనారాయణను నియమించారు. ఆయన ఈ విషయాన్ని సోమవారం విలేకరులకు తెలిపారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన సంఘ జిల్లా అధ్యక్షుడు సన్నిధి శ్రీనివాస్‌కు లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీడీఓగా సయ్యద్ సాధిక్ బాధ్యతలు



పెదపారుపూడి: పెదపారుపూడి ఎంపీడీఓగా సయ్యద్ సాధిక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బాపట్ల జిల్లా పర్చూరు మండల పరిషత్ పరిపాలనాధికారిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసిన మల్లీశ్వరీ నుంచి ఆయన చార్జీ తీసుకున్నారు. ఎంపీడీఓను ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉద్యోగులకు చట్టాలపై అవగాహన ఉండాలి



గుడివాడ టౌన్: ఉద్యోగులకు చట్టాలపై అవగాహన ఉండటం వలన వారి హక్కులను సాధించడంతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోగలుగుతారని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో మండల న్యాయ సేవాధికార కమిటీ పురపాలక సంఘ ఉద్యోగులకు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన అవసరం అన్నారు. దీని వలన వారికి శాఖాపరమైన అంశాలు తెలుస్తాయన్నారు. ప్రతిఒక్కరూ న్యాయస్థానాలు తమకు ఏ విధంగా ఉపయోగపడతాయి, ఏయే అంశాలలో కోర్టులను ఆశ్రయించవచ్చు అనేది తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలి

పామర్రు: మండలంలోని ఐనంపూడిలో ప్రభుత్వ భూములను దళితులకు పంపిణీ చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలోని రీసర్వే నంబరు 33/1,33/2,34,35లో సుమారు 10 ఎకరాల భూమిని ప్రభుత్వ భూమిగా ప్రకటించారన్నారు. ఈ భూమిని గ్రామంలోని భూమిలేని దళితులకు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రవికాంత్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి ఒడుగు గంగాధర్, నాయకుడు ముళ్లపూడి విల్సన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నందివాడ: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలు సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ పెయ్యల ఆదాము పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ పి.మల్లేశ్వరి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరాఘవపురం సర్పంచ్ కాకారల సురేష్ మాట్లాడుతూ మండలంలో 50 నుంచి 60 వరకు బెల్ట్ షాపులు ఉన్నాయని ఒక్కొక్క సీసాపై అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారన్నారు. శంకరంపాడు సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామానికి వచ్చే తాగునీటిని చేపల చెరువు యజమానులు అక్రమంగా వాడుకుంటున్నారని తెలిపారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

గుడివాడ టౌన్: స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో కుసుమ హర యువసేన ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. కుసుమ హర యువగళ ప్రభు ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకుని ఈ మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కె. జగన్మోహనరావు, జి. సునీల్, ఆర్. వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక బంటుమిల్లి రోడ్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. టి. సాయి మురళీకృష్ణ, పుట్టి హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు ఇలా..
సాగునీరు పారేదెలా!

గుర్రపుడెక్కతో నిండిన కాలువలు

పమిడిముక్కల: మండలంలోని పలు పంట కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోవడంతో సాగునీరు పారుదలకు తీవ్ర అడ్డంకిగా మారింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఉయ్యూరు నుంచి మంటాడ, గురజాడ, తాడంకి, మద్దిరవాడ గ్రామాల వరకు ప్రవహించే అప్పర్ పుల్లేరు కాలువ గుర్రపుడెక్కతో నిండిపోయింది. పుల్లేరు కింద వేల ఎకరాల సాగుభూమి ఉంది. మంటాడ, గురజాడ, తాడంకి గ్రామాలు పుల్లేరు పక్కనే ఉండటంతో కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. కాలువంతా గుర్రపుడెక్క, పేరుకుపోవడంతో దిగువకు సాగునీరు సక్రమంగా పారడం లేదు. కాలువ చివరి భూములకు సక్రమంగా నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు.



మంటాడ వద్ద గుర్రపుడెక్కతో నిండిపోయిన అప్పర్ పుల్లేరు కాలువ



వీరంకిలాకు వద్ద మొక్కలు, చెత్తతో నిండిన కనకవల్లి డ్రెయిన్

కనకవల్లి డ్రెయిన్ పరిస్థితీ అంతే...

తోట్లవల్లూరు మండలంలోని కనకవల్లి నుంచి పమిడిముక్కల మండలంలోని ఐనంపూడి వరకు కనకవల్లి డ్రెయిన్ విస్తరించి ఉంది. వేలాది ఎకరాల్లోని మురుగునీరు ఈ డ్రెయిన్ ద్వారా దిగువకు వెళ్లాల్సి ఉంది. డ్రెయినంతా గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలతో నిండి ఉంది. వీరంకిలాకు వంతెన వద్ద డ్రెయిన్ కొంత మేర చెత్త, పిచ్చిమొక్కలతో పూడిపోయింది. వర్షాకాలంలో మురుగు సక్రమంగా దిగువకు వెళ్లక పోవడంతో పొలాలు ముంపునకు గురవుతున్నాయి. అదేవిధంగా శివారు భూములకు సక్రమంగా సాగునీరందాలంటే పంటకాలువల పూడికతీత చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం కొత్తగా నియమించిన సాగునీటి సంఘాలు కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క, తూటు కాడ కాడ, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గుర్రపుడెక్క అల్లుకుపోయింది

మంటాడ పరిధిలోని కాలువంతా గుర్రపుడెక్క అల్లుకుపోయి ఉంది. శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల ప్రాంతంలో ఎక్కువగా ఉంది. పూర్తి స్థాయిలో తొలగించకుండా పక్కకు తీయడం వల్ల ఉపయోగం లేదు. సాగునీటి సంఘాలు దృష్టి పెట్టాలి.

– కంభపు లక్ష్మయ్య, మంటాడ

దుర్గంధం వెదజల్లుతోంది

గురజాడ వంతెన వద్ద కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోయింది. సంవత్సరాల తరబడి అలాగే ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వంతెన పైనుంచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.

– జంపాన కృష్ణ, గురజాడ

గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు

పుల్లేరు కాలువలో గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. అంచనాలు రూపొందించి అధికారులకు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– అరుణ్‌కుమార్, పామర్రు ఇరిగేషన్ ఏఈ

ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం

పామర్రు: విద్యా హక్కు చట్టం– 2009 ప్రకారం 2025–26 సంవత్సరానికి పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాల్లో 25 శాతం సీట్లు కేటాయించాలని పామర్రు ఎంఈఓ–2 పద్మవాణి పేర్కొన్నారు. స్థానిక ఎంఆర్‌సీలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ చట్టం ప్రకారం ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశాలు పొందిన పిల్లలకు ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని తెలిపారు. ఈ నెల 20 నుంచి 24 వరకు విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి, 29న లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు.

విద్యార్థులకు నీతి కథల బోధన

మండవల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీనా ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థీ ఒక నీతి కథను చదివి, దాని సారాంశం మిగతా విద్యార్థులకు వివరించారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వండి

మండవల్లి: జలజీవన్ మిషన్ పనులు ఈ వేసవిలో పూర్తి చేసి, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఉచితంగా అందజేయాలని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక తహసీలార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్‌కు, ఎంపీడీఓ రామలింగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

మంత్రి లోకేష్, ఎమ్మెల్యే చొరవతో బాధితురాలికి విముక్తి

గుడివాడరూరల్: మంత్రి లోకేష్, ఎమ్మెల్యే రాము చొరవతో గుడివాడకు చెందిన గల్ఫ్ బాధితురాలికి విముక్తి కలిగింది. మస్కట్ నుంచి క్షేమంగా ఇంటికి వచ్చిన యువతి ప్రేమకుమారి సోమవారం ప్రజావేదికలో ఎమ్మెల్యే రామును కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యువతి ప్రేమకుమారి మాట్లాడుతూ తాను గల్ఫ్‌లోనే చనిపోతానేమోనని భయం వేసిందని చెప్పారు. శరీరమంతా ఎలర్జీ వ్యాపించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డానని తెలిపారు. తన కష్టాన్ని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకురాగా ఆయన తన పరిస్థితిని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారని పేర్కొంది.

వంతెన పనులు ప్రారంభించాలని వినతి

తోట్లవల్లూరు: పెనమకూరులో ఏనుగులకోడు డ్రెయిన్‌పై ఉన్న వంతెన శ్లాబు, సైడ్‌వాల్స్ పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మచిలీపట్నం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఆయన వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



మొవ్వ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ మొవ్వ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర మంతటా ఏకరీతి పదోన్నతుల సీనియారిటీ జాబితాలను తయారు చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో మాతృభాషలోనే బోధన కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కే మస్తాన్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఆలూరి సురేష్, మండల శాఖ ప్రధాన కార్యదర్శులు బి.మాణిక్యాలరావు, పి.దుర్గాప్రసాద్, టీచర్స్ సొసైటీ అధ్యక్షుడు ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్లో ప్రవేశాల కోసం ఇంటింట ప్రచారం



ముదినేపల్లి రూరల్: వైవాక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి ఉపాధ్యాయులు సోమవారం గ్రామంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. యూపీ స్కూల్ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావడంతో పై తరగతుల ప్రవేశాల కోసం విద్యార్థులను హైస్కూల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా నలుగురు విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తూ ప్రవేశపత్రాలు అందజేశారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడరూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన మినుము, పెసర కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ బోలెం అనంత లక్ష్మి అన్నారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ గుడివాడ మార్కెట్‌యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మినుముకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,400, పెసరకు క్వింటాకు రూ.8,682గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు తమ మినుము, పెసర పంటను ప్రభుత్వానికి అమ్మాలనుకుంటే సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మినుములు ప్రభుత్వానికి విక్రయించే రైతులు వాటిని రెండుసార్లు జల్లెడ, కాట ఏపీమార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ నమూనా మేరకు వేయాలన్నారు. రవాణా, కాటా, లేబర్‌ను రైతులే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

నేడు మెగా వైద్య శిబిరం

కైకలూరు: కోరుకొల్లు వాకర్స్ క్లబ్, క్రాంతి హైస్కూల్ ఆధ్వర్యంలో క్రాంతి హైస్కూల్ వద్ద మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెన్నంశెట్టి కృష్ణ సోమవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ బీడీపీఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు టి.ఎన్. రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని పవన్‌ప్లాజాలో సోమవారం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూత్ సర్వీసెస్ చైర్మన్ వై. రెడ్డయ్య చౌదరి, కె. వెంకటేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి జి. కిరణ్‌బాబు, జి. నరేష్, రామకృష్ణ, ఎ. సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతి



కైకలూరు: వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి వార్షిక జయంతి మహోత్సవాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కైకలూరులో అమ్మవారి దేవస్థానం నుంచి ఆర్యవైశ్య కన్యలతో 102 కలశాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు చొప్పర్ల మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు జయంతి మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు కొప్పర్తి గోపాలకృష్ణమూర్తి, సమయమంతుల రాజా, వరదా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ బాలాజీ



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాలాజీ

గుడివాడరూరల్: డివిజన్‌లోని క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు ముఖ్యమైన క్రీడా పోటీలను నిర్వహించి, ఎన్టీఆర్ స్టేడియానికి మంచి పేరు ప్రతిష్టలు వచ్చే విధంగా కమిటీ కృషి చేయాలని జిల్లా కలెక్టర్, స్టేడియం చైర్మన్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పలు కీలకమైన అంశాలను కమిటీ సభ్యులు చర్చించారు. డివిజన్ పరిధిలో కొంతమంది విద్యార్థులను గుర్తించి ఏ క్రీడల్లో నైపుణ్యం కనబరుస్తున్నారో వారికి కోచ్‌లు శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపి స్టేడియానికి మంచి పేరు వచ్చే విధంగా తీర్చిదిద్దాలని పాలకవర్గ సభ్యులకు కలెక్టర్ సూచించారు. ఆ ఆర్థిక సంవత్సరంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించేందుకు కమిటీ తీర్మానించింది. ఇండోర్ స్టేడియం భవనాల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే రాము కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మున్సిపల్, రహదారులు భవనాల ఇంజినీర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టేడియం కమిటీలో ప్రస్తుతం ఉన్న నిబంధనలు ఇతర ప్రాంతాల్లోని స్టేడియాల్లో అమలవుతున్న నిబంధనలు అధ్యయనం చేసేందుకు సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని, వారిచ్చిన నివేదికను అనుసరించి సవరణ చేయాలని కమిటీ తీర్మానించింది. సమావేశంలో ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం, స్టేడియ కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి

కైకలూరు: కార్మికులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్ తాపీ వర్కర్ల యూనియన్ భవనంలో కార్మికుల చట్టాలపై సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వివిధ ఫ్యాక్టరీల్లో ఉద్యోగాలకు వెళుతున్న యువకుల వద్ద 10, ఇంటర్ సర్టిఫికెట్లను యజమానులు అడుగుతున్నారన్నారు. అటువంటి వారికి సర్టిఫికెట్లు ఇవ్వవద్దని పేర్కొన్నారు. లేబర్ కోర్టు కార్మికులకు అందుబాటులో ఉందన్నారు. కైకలూరు లేబర్ ఆఫీసర్ దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్మికులు ఈ–పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. బీఎంఎస్ నాయకుడు యానాల బసవయ్య, అసంఘటిత కార్మిక సంఘ నాయకులు కొండ, కర్ణ శ్రీను, పాన్నూరు జగన్, తోట శ్రీను, సింహాద్రి రాంబాబు, తుపాకుల సోమాచారి పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి



జమీగొల్వేపల్లిలో చిన్నారులచేత దేశభక్తి గీతాలను పాడిస్తున్న ఉషాదేవి

జమీగొల్వేపల్లి(పామర్రు): చిన్నారులందరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం దేశభక్తి గేయాలు అనే అంశంపై పాటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచి విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సోమవారం నీతి కథలు చదివించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి తెలిపారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు దేశనాయకుల జీవితచరిత్రల గురించి వివరించారు. ఉపాధ్యాయుడు పసుమర్తి సూర్యనారాయణమూర్తి మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకుల జీవిత చరిత్రలు, స్వాతంత్ర్యం కోసం వారు పోరాడిన విధానం తెలియజేశారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి విద్యార్థులకు పలురకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

తోట్లవల్లూరు: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి హరి దుర్గా నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి రోజూ స్వామి వారి గ్రామోత్సవం, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఉపాధి వేతనాల కోసం కూలీల ఆందోళన



తోట్లవల్లూరులో ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు, సీపీఎం నాయకులు



పమిడిముక్కలలో నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు



మొవ్వ ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన

తోట్లవల్లూరు: ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుడిశె వెంకట సుబ్బారావు డిమాండ్ చేశారు. ఉపాధి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన కూలీలతో కలిసి సోమవారం ధర్నా చేశారు. చట్ట ప్రకారం కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించాలని, పని లేని రోజుల్లో నిరుద్యోగ భృతి ఇవ్వాలని, కొత్త జాబ్ కార్డులు వెంటనే ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. నాయకులు కంభం కొండలబాబు, జుజ్జవరపు ఏసోబు, మేరుగ ఆదిశేషు, వల్లూరు డేవిడ్ పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు కోసూరి శివనాగేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఉపాధి హామీ పథక కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు నిరసన తెలిపి టీఏ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు.

పామర్రులో..

పామర్రు: ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకుడు వై నరసింహారావు తదితరులు ఎంపీడీఓ కె జ్యోతికి సమస్యల మెమోరాండాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాధర ప్రసాద్, నాయకులు ముళ్లపూడి విల్సన్, ఇంటి రాజు, విజయలక్ష్మీ వెంటేశ్వరమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి కార్యాలయ ఏఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు, మండల నాయకులు కొడాలి కరుణాకర్ రావు, శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, శీలం బాబురావు, అనిల్‌బాబు, సీఐటీయూ మండల కార్యదర్శి కాకి రాజశేఖర్, కమిటీ సభ్యుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొడాలి నాని సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని పూజలు



నందివాడ: మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని బైపాస్ సర్జరీ విజయవంతంగా జరగడంతో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని, ప్రజా జీవితంలోకి రావాలని కోరుకుంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆయన అభిమానులు పలు ఆలయాల్లో ఆదివారం పూజలు, చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. తొలుత నందివాడలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెన్నపూడి గ్రామంలోని లూర్దు మాత పవిత్ర పుణ్యక్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కును చెల్లించారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్, గొర్ల శ్రీను, పాలడుగు చంటి, ఎంపీపీ పెయ్యల ఆదాం, షేక్ బాజీ, షేక్ సమ్మ, మట్టా జాన్ విక్టర్, దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, గుల్లపూడి చంద్రశేఖర్, కందుల నాగరాజు, తోట నాగరాజు, లింగం సుందర్‌రావ్, కష్టారెడ్డి, ఆంజనేయప్రసాద్, ఇస్సాకు, అశోక్ లాజర్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.